"ఒరేయ్ దగుల్బాజీ వెధవా... విషయమేంటో వివరంగా చెప్పు.... నీకు చీరలతో అవసరం ఏముంది?"

"అంటే నేను రాత్రి పూట చీర కట్టుకుని నేలమీద ఓ నెల రోజులు పడుకుంటే నన్ను అదృష్టం వరిస్తుందని ఓ సిద్ధాంతి చెప్పాడు. అందుకనీ..."

"కెవ్వ్..." గుండెల మీద చెయ్యేసుకుని అరిచింది పార్వతి.

"మేమిక్కడ ఉన్నన్ని రోజులూ నువ్వు చీర కట్టుకుని ఆ అవతారంతో నాక్కనిపించావో పీక పిసుకుతా.... కొన్ని రోజులు ఆ సిద్ధాంతిని మరిచిపో...."

"అలాగే నాన్నా!" బుద్ధిగా తల ఊపాడు బుచ్చిబాబు .

"ఇంకా అదృష్టం నీ నెత్తిన తన్నడానికి శవ పూజలు కూడా చెయ్యాలని మీ సిద్ధాంతి వెధవ చెప్పలేదా?...." అడిగాడు పర్వతాలరావు .

"ఏమో...ఇంకా చెప్పలేదు మరి...... " నసిగాడు బుచ్చిబాబు .

"అయితే ఆ సిద్ధాంతి వెధవ చెప్తే శవపూజలు కూడా చెయ్యడానికి రెడీ అన్నమాట" నొసలు కొట్టుకున్నాడు పర్వతాలరావు .

"కెవ్వ్!" మళ్ళీ అరిచింది పార్వతమ్మ .

* * *

సీత చెప్పిన మాట విని బుచ్చిబాబు వంక ఆశ్చర్యంగా చూశాడు మోహన్. బుచ్చిబాబు తల వొంచుకున్నాడు.

"ఇది నిజమేనా?" అన్నాడు మోహన్.

"ఆయన్ని ఎందుకు అడుగుతారు? నేను చెప్తున్నా కదా ... నేను ఆయన భార్యని కాను. స్నేహితురాలిని. మేం కలిసి బ్రతుకుతున్నాం. హఠాత్తుగా ఆయన తల్లిదండ్రులు రావటంచేత నేను మీ ఇంట్లో తలదాచుకోడానికి రావలసి వచ్చింది. మీకు చాలా శ్రమ కలిగించాం. సారీ!" అంది సీత.

"అయ్యో! ఇందులో శ్రమేం ఉందండీ..... ఇట్స్ ప్లజర్....... కానీ ఈ టాపిక్‌ని ఇక్కడితో ఆపేద్దాం...... మా ఆవిడ వింటే బాగుండదు" అన్నాడు మోహన్ ఇబ్బందిగా లోపలికి చూస్తూ.

"మనకెంత విలువుందో చూశావ్‌గా?" సీత బుచ్చిబాబు చెవిలో అంది.

"మొదట్లో అలానే ఉంటుంది.....రాను రాను అదే అలవాటై పోతుంది" బుచ్చిబాబు సీత చెవిలో అన్నాడు.

ఇంతలో రామలక్ష్మి లోపలి నుంచి కాఫీ కప్పుల్తో వచ్చింది. అందరూ కాఫీలు తాగారు. కాస్సేపు కబుర్లు చెప్పుకున్నాక బుచ్చిబాబు లేచి నిలబడ్డాడు.

"నేనిక వెళ్తాను"

"అప్పుడేనా?" అంది సీత.

"వెళ్ళాలి" అన్నాడు బుచ్చిబాబు .

“రేపు ఆఫీసుకు వస్తున్నావ్ కదూ?” అడిగాడు మోహన్.

“ఊ.....వస్తాను..... నేను రానందుకు ఏకాంబరం ఈవేళ ఏమైనా అన్నాడా?”

“లేదు. ఆ కిల్లారికిత్తిగాడు నిన్నేమీ అనడుగా?” నవ్వుతూ అన్నాడు మోహన్.

“నేనిక వస్తానురా.....వస్తానండీ.....” బుచ్చిబాబు మోహన్‌కీ, రామలక్ష్మికీ చెప్పి బయటికి వెళ్ళాడు.

మోహన్ దంపతులు అక్కడే ఆగిపోయారుగాని సీత గుమ్మం దాకా బుచ్చిబాబు వెనకాలే వెళ్ళింది.

“వస్తాను సీత ....” చెప్పాడు బుచ్చిబాబు .

“అయినా కాస్సేపుంటే నీ సొమ్మేం పోయింది?” అంది సీత చిరుకోపంగా.

“మా అమ్మా నాన్నలు కనకదుర్గ గుడికి తీస్కెళ్ళమని అడిగాడు. ఇప్పటికే చీకటైపోయింది. ఇంకా ఆలశ్యం అవుతే గుడి కట్టేస్తారు”.

“నాకు ఇక్కడ బోరుకొట్టి చస్తున్నా.....మీ అమ్మానాన్నా ఎప్పుడు వెళ్ళిపోతారు?”

“ఏమో మరి........ నేనెలా అడగను?” నిస్పృహాయంగా అన్నాడు బుచ్చిబాబు .

“రేపు ఆఫీసుకి వెళ్లే ముందు ఇక్కడికి వచ్చి నాకు కనిపించాలి. సాయంత్రం ఆఫీసు నుంచి ఇక్కడికి త్వరగా రావాలి”.

“అలాగే.....ఇంక వస్తానూ....”

సీత బుగ్గమీద చిటికేసి అక్కడి నుండి బయలు దేరాడు బుచ్చిబాబు .

0 0 0

ఆ రాత్రి బుచ్చిబాబుకి నిద్రపట్టలేదు. అతని బుర్రనిండా ఆలోచనలే!

అతని తల్లిదండ్రులు అక్కడ ఎన్ని రోజులు ఉంటారో తెలీదు. సీత మోహన్ వాళ్ళింటిలో ఏం అవస్థలు పడాలో ఏమో! మీరెప్పుడు వెళ్తారు అని తల్లిదండ్రుల్ని అడగడం బాగోదు. ఒకవేళ సీతకి చికాకుపుట్టి సూట్‌కేసు తీసుకుని ఇంటికొచ్చేస్తే అప్పుడెలాగా? వీళ్ళకి ఏమని సమాధానం చెప్పాలి?

ఇలా ఆలోచిస్తూ అలోచిస్తూ ఎప్పుడో అర్ధరాత్రి అతను నిద్రలోకి ఒరిగాడు. తెల్లారి నిద్ర లేచేసరికి ఏడు దాటింది. కంగారుగా సోఫాలోంచి క్రిందికి దూకి వంటగదిలోకి పరుగుతీశాడు.

అక్కడ పార్వతమ్మ అప్పుడే వంట మొదలు పెట్టేసింది. బుచ్చిబాబు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు నిద్రమత్తులో తల్లి వచ్చిన సంగతే అతనికి తట్టలేదు.

హమ్మయ్య......ఈవేళ మనకేం హడావిడి లేదన్నమాట....అనుకున్నాడు.

బుచ్చిబాబు వచ్చిన అలికిడికి పార్వతమ్మ వెనక్కి తిరిగి చూసింది.

"నిద్రలేచావా బుచ్చీ పాపం! మొహం కడుక్కునిరా కాఫీ ఇచ్చేస్తా" అంది.

బుచ్చిబాబు అయిదు నిమిషాల్లో మొహం కడుక్కుని వంటగదిలోకి వెళ్ళాడు.

"అమ్మా కాఫీ" అన్నాడు.

"ఉండు....వేడి చేస్తున్నా" అని చెప్పి "ఒరేయ్ నిన్నో విషయం అడగనా?" అంది మెల్లగా.

మళ్ళీ ఏ కొంపలు ముంచే విషయం అడుగుతుందోనని గుండెలు గుబగుబలాడ్తుండగా "ఏంటి?"అన్నాడు బుచ్చిబాబు .

"నిన్న సాయంత్రం ఇల్లు సర్దుతుంటే నాకు లోపలి లంగాలూ, గాజులూ, కాటుకా కూడా కనిపించాయ్.... అవన్నీ ఇక్కడెందుకున్నాయిరా? నాకేంటో భయంగా ఉందిరా పాపం! మీనాన్నకీ విషయం చెప్పలేదు చెప్తే బద్దలయ్యేలా అరుస్తారు పాపం."

బుచ్చిబాబు ఒక్క క్షణం గతుక్కుమని అంతలోనే గలగలా నవ్వేస్తూ "ఓ హదా?హ హ హ ......మరేమో నేను రాత్రిపూట ఒట్టిగా చీర కట్టుకుంటే అసయ్యంగా ఉంది నన్ను నేను అద్దములో చూసుకుంటే.అటు ఆడా ఇటు మగా కాకుండా ఏంటీ రూపం అనిపించి అవన్నీ కూడా వేసుకుని చక్కగా కాటుక పెట్టుకుని, బొట్టు పెట్టుకుని పడుకుంటా......హి!"

"మరి జడ ఉండదు కదరా?" అమాయకంగా అడిగింది పార్వతమ్మ .

"అయితే నన్నిప్పుడు సిల్లీగా విగ్గు పెట్టుకోమంటావా యేంటి కొంపదీసి....నా వల్లకాదు బాబూ!!"

"భలే వాడివే ....మేమెందుకంటాంరా నాయనా......" అంటూ స్టవ్‌మీంచి కాఫీ దింపి కప్పులోపోసి బుచ్చిబాబుకిచ్చింది.

"నాన్నారేరే అమ్మా?" ఆడిగాడు బుచ్చిబాబు .

"కూరగాయలు తేడానికి మార్కెట్ కెళ్ళారు".

"నేను హాల్లో న్యూస్ పేపర్ చదువుకుంటూ కాఫీ త్రాగుతా"

బుచ్చిబాబు కాఫీ కప్పుతో హాల్లోకి వెళ్ళి సోఫాలో కూర్చుని న్యూస్ పేపర్ తిరగేస్తూ కాఫీ త్రాగాడు. ఖాళీ కాఫీ కప్పు టీపాయ్ మీద పెడ్తుండగా పర్వతాలరావు చేతిలో కూరగాయల సంచిలో లోపలికి వచ్చాడు.

"ఏరా వెధవాయ్.....తీరుబడిగా ఇప్పుడు లేచావా?" అని బుచ్చిబాబుని ప్రేమగా పలకరించి "హూష్....."అంటూ సోఫాలో కూలబడ్డాడు పర్వతాలరావు .

రెండు క్షణాల తర్వాత మొహం చిట్లించి చూస్తూ బుచ్చిబాబుని అడిగాడు" అవునుగానీ పొద్దున్న పాలవాడొస్తే నేను పాలు పోయించుకున్నా....వాడేమో అమ్మగారు లేరా సార్? అని అడిగాడు. అమ్మగారెవరు?"

ఉహించని అ ప్రశ్నకి బుచ్చిబాబు చాలా కంగారు పడిపోయాడు. చచ్చాన్రా నాయనా....... ఇప్పుడేం చెప్పాలి? అని సతమతమైపోతుండగా సడెన్‌గా ఫ్లాష్‌లా అతనికి ఆలోచన తట్టింది.

“అంటే అదీ....మరేమో నేను చీరకట్టుకుని పడుకుంటాను కదా.......వాడు తెల్లారేవచ్చి బెల్లు కొడ్తే నేను నిద్రమత్తులో అలానే లేచి పాలు పోయించుకుంటుంటాను, వాడేమో అ అవతారంలో నన్ను చూసి నేనని అనుకోకుండా అమ్మగారు అనుకుంటుంటాడు.....హి హి హి”

“మరి మీసాలు ఉంటాయ్ కదరా పింజారీ వెధవా?” అనుమానంగా చూస్తూ అడిగాడు పర్వతాలరావు .

“తెల్లారి ఆ మసక వెలుతురులో వాడికి మీసాలు ఎక్కడ కనిపిస్తాయ్ నాన్నా....”

“మరి క్రాఫింగో?”

“అమ్మగారు తిరుపతి వెళ్ళి మొక్కు తీర్చుకుందేమో అనుకుని అంటాడు”

“అవునండీ.....వీడేమో చక్కగా బోట్టు కాటుకా కూడ పెట్టుకుని పడుకుంటాడట పిచ్చి సన్నాసి” అప్పుడే అక్కడికి మంచినీళ్ళ గ్లాసుతో వచ్చిన పార్వతమ్మ అంది.

“వెధవ....వెధవన్నర వెధవ ....సన్నాసెధవ ....పిజారీవెధవ......ఏబ్రాసివెధవ...... టింగరెధవ.....”సోఫా కోడుకేసి తల కొట్టుకుంటూ బాధగా అన్నాడు పర్వతాలరావు .

0 0 0

డోర్ బెల్ మోగితే లేచెళ్ళి తలుపు తీసాడు మోహన్.

ఎదురుగా మేనేజర్ ఏకాంబరం !

ఈ కిల్లారికిత్తిగాడు ఇప్పుడెందుకొచ్చాడబ్బా అనుకుంటూ మోహన్ కంగారు పడిపడిపోయాడు.

“వాటె ప్లజేంట్ సర్ప్రయిజ్ సార్! రండి సార్ రండి!”అంటూ లోపలికి ఇన్వైట్ చేశాడు మోహన్, ఇప్పుడెందుకు వచ్చాడా అని తిట్టుకుంటూ.

“ఈ ప్రక్క సందులోనే మా బంధువులాయన ఉన్నాడు. అతనికి ఒంట్లో బాగోలేదంటే చూద్దామని వచ్చాను. నువ్విక్కడే ఉంటావని తెలిసింది....అందుకే వచ్చా ఇక్కడిదాకా వచ్చి మీ యింటికి రాకుండా పోయాననుకో.... మా బాస్గాడు చాలా లెవెల్ చూపిస్తాడులే తనే పెద్ద మేనేజర్ననీ..అంటూ తింగరి మింగిరిగాడిలా ప్రచారం చేస్తావ్..... అవునా?”

“అబ్బే...నేను అలాంటి వాడిని కాద్సార్!” అన్నాడు మోహన్.

ఇద్దరూ హాల్లోకి వచ్చారు. అక్కడ సీత కూర్చుని వుంది. ఆమెని చూస్తూ “నమస్కారమమ్మా” అంటూ సీతకి నమస్కారం పెట్టి “మీ శ్రీమతేగా?” అని అడిగాడు ఏకాంబరం మోహన్ని.

సీత ఇబ్బందిగా మొహం పెట్టింది.

“అబ్బేబ్బే.....కాదండీ....” కంగారుగా అన్నాడు మోహన్.

“ఓహో....మరదలా?”

"కాదండీ.....మన బుచ్చిబాబు లేడూ?"

"ఓహో ....... అతని భార్యా?"

"కాదండీ...." బుర్ర గోక్కున్నాడు మోహన్.

సీత అప్పటికే లేచి లోపలికి వెళ్ళిపోయింది.

"అయితే అతని మరదలా" అడిగాడు ఏకాంబరం .

"అబ్బే....కాదండీ... ఆమె బుచ్చిబాబు తాలూకు! పేరు సీత !!" చెప్పాడు మోహన్.

"బుచ్చిబాబు తాలూకానా? అంటే అతనికేమవుతుంది? అయినా బుచ్చిబాబు తాలూకా అయితే మీ యింటిలో ఎందుకుంది?" అయోమయంగా అడిగాడు ఏకాంబరం.

"ఆ విషయాలన్నీ మీకు ఆఫీసులో చెప్తాను సార్!" అన్నాడు మోహన్. తర్వాత మోహన్ రామలక్ష్మిని పిలిచి ఏకాంబరానికి పరిచయం చేశాడు.

కాఫీ తీసుకుంటారా అని అడిగితే వద్దు....వద్దు......ఇంకా యింటి కెళ్ళాలి! ఆఫీసుకు తయారయి వెళ్ళాలి అంటూ హడావిడిగా వెళ్ళి పోయాడు ఏకాంబరం .

ఏకాంబరం వెళ్ళిన తర్వాత మోహన్ స్నానంచేసి న్యూస్ పేపర్ పట్టుకుని కూర్చున్నాడు ఉదయం లేవగానే చదవగా మిగిలిన ఆ కాస్త న్యూస్ చదివి ముగించాడు.

ఆఫీసు టైమవుతుంది.....భోజనం వడ్డించమని అడగడానికి వంట గదిలోకి వెళ్ళాడు మోహన్. అక్కడ రామలక్ష్మి లేదు...బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఆమె అక్కడా లేదు. పూజ గది దగ్గర కెళ్ళి గుమ్మంలో నిలబడి చూశాడు.

రామలక్ష్మి కళ్ళు మూస్కుని, రెండు చేతులూ జోడించి దండం పెడ్తూ దీక్షగా పూజ చేస్కుంటోంది.

మరి సీత ఎక్కడుంది? అనుకున్నాడు మోహన్.

స్నానం చేస్తుందేమో?

లోపలి నుండి నీళ్ళశబ్దం వినిపిస్తోంది.

సీత స్నానం చేస్తుంది. పూర్తిగా బట్టలు విప్పి స్నానం చేస్తుంది!

ఆ ఆలోచనకే అతని నరాలు జివ్వుమన్నాయి. అందుకే అతనికి దుర్బుద్ధి పుట్టింది.

దీక్షగా పూజ చేస్కుంటున్న రామలక్ష్మి పది నిమిషాలదాకా ఆ వైపు రాదని తెలుసు. ఆ బాత్రూమ్ తలుపుకి చిన్న రంధ్రం ఉందనీ అతనికి తెలుసు, తలుపుకి ఓ మూలగా ఆ రంధ్రం ఉందన్న విషయం సీతకి తెలీదన్న విషయం కూడా అతనికి తెలుసు.

దడదడలాడే గుండెతో వంగి రంధ్రంలోంచి లోపలికి చూసాడు మోహన్.

అతని గుండె కాస్సేపు అగి మళ్ళీ భారంగా కొట్టుకోసాగింది.

లోపల......

పూర్తిగా నగ్నంగా...పచ్చని శరీరంతో ....... అందమైన ఒంపుల్తో స్నానం చేస్తూ సీత !

శరీరలోని రక్తం మొత్తం మెదడులోనికి తన్నినట్టు తల భారంగా అయిపోయింది అతనికి.

క్రమ క్రమంగా అతనికి శరీరం వేడెక్కసాగింది.

0 0 0

ఏకాంబరం తన క్యాబిన్‌లో పిచ్చిపట్టినట్టు అటూ ఇటూ తిరిగుతున్నాడు. మధ్య మధ్యలో జుట్టు పిక్కుంటూ అసహనంగా "అబ్బా!" అంటున్నాడు.

ఈ కిల్లారి కిత్తిగాడు ఇంకా రాడేం? ఈ సస్పెన్స్ నేను భరించ లేకపోతున్నారా దేవుడో.... అనుకున్నాడు. మోహన్ బుచ్చిబాబు గురించి ఏదో చెప్తానన్నాడు. ఏంటది?

కేవలం బుచ్చిబాబుకి సంబంధించి ఏదో చెప్తానంటే ఇంత టెన్షన్ ఉండేది కాదు. కానీ మోహన్ బుచ్చిబాబు ప్లస్ సీతకి సంబంధించిన విషయం ఏదో చెప్తానన్నాడు! ఏంటది?

ఏంటి?

జుట్టు పీక్కున్నాడు ఏకాంబరం .

"ఏం సార్! బాగా తలనెప్పిగా వుందా?"

ఆ గొంతు విని ఉలిక్కిపడి గుమ్మంవేపు చూసాడు ఏకాంబరం. మోహన్ క్యాబిన్ గుమ్మం దగ్గర నిలబడి వున్నాడు.

"వచ్చేసావా? ఏంటయ్యా ఇంతాలస్యం చేశావ్? రా రా...." గబ గబా అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

మోహన్ ఆయన టేబిల్ దగ్గరికి నడుచుకుని వస్తూ అన్నాడు "ఆలస్యం ఎక్కడ సార్? ఇంకా పది కాలేదుగా?"

"అయినా నువ్వు చాలా టెన్షన్ పెట్టేశావోయ్"

"ఏం సార్? ఏదయినా అర్జంట్ ఫైల్స్ ఉన్నాయా?"

"ముందు నువ్వు కూర్చో చెప్తా!"

"వద్దు సార్! మీ ముందు కూర్చుంటే కిల్లారికిత్తిగా అంటూ మళ్లీ నన్ను లేపుతారు సార్" భయంగా అన్నాడు మోహన్.

ఏకాంబరం బళ్ళుమని నవ్వేసాడు.

"సర్లేవయ్యా! నువ్వు కిల్లారికిత్తిగాడివి కాదు. డింగాల డిప్పివే..... ఇప్పుడు కూర్చో"